ఉచిత కంప్యూటర్ శిక్షణ

రాయచోటి టౌన్ : ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడేలా గాఫర్ కాంప్లెక్స్‌లోని ఉర్దూ కంప్యూటర్ సెంటర్‌లో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఎన్ అయ్యుబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ముస్లిం మైనార్టీల కోసం సాంకేతిక పరిజ్ఞానం అందించి స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఉర్దూ అకాడమీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారితో కలిసి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 36 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ల శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అభ్యర్థులు కనీస విద్యార్హత పదవ తరగతి కలిగి ఉండి 40 సంవత్సరాల లోపు స్త్రీ, పురుషులు మైనార్టీ, ఇతర కులాలకు చెందిన వారు అర్హులని అన్నారు. ఉర్దూ బాష చదవడం రాయడం వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత స్కిల్ డెవలప్మెంట్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ సంయుక్తంగా సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9502020033727, 99664663లలో సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి : జెసి

బాధితులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు వరద పీడిత గ్రామాలైన పులపతూరు, తోగురుపేట, మందపల్లె గ్రామాల్లో బాధితుల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అందజేసేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం అన్నమయ్య ప్రాజెక్టు వరద గ్రామాలైన పులుపుతూరు గ్రామాన్ని ఆయన సందర్శించి అక్కడ బాధితుల కోసం నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా తమకు ఇంత వరకు ఒక్క ఇళ్లను కూడా పూర్తిగా నిర్మించి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎండకు, వానకు, చలికి నానా అవస్థలు పడుతున్నామని జెసి దృష్టికి తీసుకువచ్చారు. ఇంటి ముందు ఆరడుగుల మేర సన్ సైడ్ బండను నిర్మించి ఇవ్వాలని కాంట్రాక్టర్ను పలుమార్లు ప్రాధేయపడినా తాను నిర్మించి ఇవ్వనని, ప్రభుత్వం చెప్పిన నిబంధన ప్రకారం ఆ కొలతల ప్రకారమే ఇళ్లను నిర్మించి ఇస్తానని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరడుగుల మీద సన్ సైడ్ బండ వేసేందుకు ఎంత ఖర్చు అవుతుందో ఆ మొత్తాన్ని బాధితులే భరిస్తామని తెలిపారు. పనిలో పనిగా ఆ బండను ప్రతి ఇంటికి కాంట్రాక్టర్ నిర్మించి ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని జాయింట్ కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకొచ్చారు. స్పందించిన జెసి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను ఏ విధంగా పరిష్కరించాలో చర్చించి చర్యలు చేపడతామని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఇఇ కుప్పుస్వామి, డిఒ మురళి, ఆర్‌డిఒ కార్యాలయ సిసి కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

7, 8న కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎల ధర్నా

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7,8 తేదీల్లో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గ్రామ సేవకుల సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి గ్రామ సేవకులను రెగ్యులర్ చేస్తానని, జీతం పెంచుతానని, పిఆర్‌సి అమలు చేస్తానని, అబద్దపు హామీలతో పోస్టులు వేయించుకుని అధికారం చేపట్టిన తర్వాత హామీలు అమలు చేయకపోగా ఇచ్చిన డిఎను వెనక్కి తీసుకున్నారని విమర్శించారు. నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులైన వారికి అర్హులైన వారికి గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. విఆర్‌ఎ వ్యవస్థ లేకుండా చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వచ్చే ఎన్నికల్లో గ్రామ సేవకులు బుద్ధి చెబుతారని తెలిపారు. డిఎలు ఇవ్వాలని, రీసర్వేలో ప్రతి విఆర్‌ఎకు డిఎలతోపాటు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో తీవ్ర ఎండలకు రీ సర్వేలో పాల్గొని గుండెపోటుతో చనిపోయిన గ్రామ సేవకుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. పిఆర్‌సి అమలుచేయాలని 7,8 తేదీల్లో నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని జిల్లాలోని గ్రామ సేవకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం జిల్లా కన్వీనర్ యస్. అల్లా బకాష్, కో-కన్వీనర్ జి.భోగేశ్వరయ్య, కోడూరు డివిజన్ అధ్యక్షుడు కె.సుధాకర్, కలికిరి రెడ్డెయ్య, రాయచోటి అధ్యక్షుడు పి.నరసింహులు, ఆర్.రామ్మోహన్, చంద్రాయుడు, రామయ్య, శివప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై జిల్లా స్థాయి శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

ప్రజాశక్తి - రాయచోటి

అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన మీటింగ్‌హాల్‌లో జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు, మండల ఉద్యాన అధికారులకు, డివిజినల్ డిప్యూటీ స్టాటిస్టికల్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులకు పంట కోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మట్లాడుతూ పంట కొత ప్రయోగాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, పంట కోత ప్రయోగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కింది స్థాయి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఆర్‌బికెల సిబ్బంది పంట కొత ప్రయోగాల రికార్డులు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 2023-24 ఏడాదిలో ఖరీఫ్, రబీ సీజన్‌లో వివిధ పంటలలో వ్యవసాయ, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ వారు చేయాల్సిన పంట కొత ప్రయోగాల గురించి తెలియజేశారు. జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ కింది స్థాయి సిబ్బంది దిగుబడి నమోదు చేయడంలో తీసుకోవలసిన జాగ్రతలు వివరించారు. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ పీలేరు, కురబలకోట వారు పంట కొత ప్రయోగాలు ఎలాచేయాలి, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిపిఒ, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు, మండల ఉద్యాన అధికారులకు, డివిజినల్ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ బాధితులకు పరిహారం పంపిణీకి చర్యలు

సమీక్ష సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్ భూసేకరణ అంశాలపై సంబంధిత ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 716 కడప నుండి రేణిగుంట జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పూర్తి చేశామన్నారు. భూసేకరణకు పరిహారం రూ.98 కోట్లు చెల్లింపు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.79 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.18 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్‌హెచ్ 440 రాయచోటి-వేంపల్లికి సంబంధించి రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.25 కోట్లు చెల్లించామన్నారు. ఇంకను రూ.8కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుండి పీలేరుకు సంబంధించి రూ.121 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.108 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.13 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్‌హెచ్ 42 మదనపల్లి నుండి మొలకలచెరువుకు సంబంధించి భూసేకరణ కొంత పెండింగ్లో ఉందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కూడా రూ.61 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.43.63 కోట్లు చెల్లించారని ఇంకనూ రూ.17.43 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి లెవెల్ క్రాసింగ్ 119లో భూ సేకరణ పూర్తి చేశారని, ఇందులో ఇంకను రూ.69 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. లెవెల్ క్రాసింగ్ 120లో ఇంకను భూసేకరణ చేయాల్సి ఉందని త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని రాయచోటి ఆర్డిఓను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకనూ రూ.1.33 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. లెవెల్ క్రాసింగ్ 95కు సంబంధించి సిటిఎం గ్రామంలో భూసేకరణ త్వరితగతిని పూర్తి చేయాలని మదనపల్లి ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా మొత్తంగా జాతీయ రహదారుల అంశానికి సంబంధించి పరిహారం చెల్లింపులలో వచ్చే వారంలోగా 80 శాతం ప్రగతిని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. అలాగే ఇంకను పెండింగ్ ఉన్న భూసేకరణను త్వరితగతిని పూర్తి చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. భూసేకరణను ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ప్రాజెక్టు వారీగా సాధించిన ప్రగతి, పరిహారం చెల్లింపు, కోర్టు కేసులు, పెండింగ్ ఫైల్స్ తదితర అంశాలను సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, ఎన్‌హెచ్ అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కదలని హెల్త్ సెంటర్ల నిర్మాణాలు

- మూడేళ్లుగా నత్తనడకన పనులు
- జిల్లాకు 309 భవనాలు మంజూరు
- 118 మాత్రమే పూర్తి
- వివిధ దశల్లో మరికొన్ని భవనాలు

చీమలచెరువుపల్లిలో ఆగిపోయిన హెల్త్ సెంటర్ పనులు

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకేచోట ఉందుబాటలో ఉండాలనే సంకల్పంతో గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. వాటికి సంబంధించిన నిర్మాణాల ఎక్కువ చోట్ల కదలిక వివిధ దశలలో నిలిచిపోయాయి. జిల్లాలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడం, కొన్నిచోట్ల స్థలాల సేకరణ ఆలస్యం కావడం, కోర్టు, వివిధ కారణాల వల్ల హెల్త్ సెంటర్ల పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వం 309 హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 118 సెంటర్లు మాత్రమే పూర్తయ్యాయి. 10 భవనాలకు కనీసం పునాదులు కూడా తీయలేదు. ఉపాధి హామీ పథకం (కన్వర్జెన్సీ) నిధులతో సొంత భవనాలు నిర్మించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశ్యం. హెల్త్ సెంటర్ నిర్మాణ పనుల బాధ్యతను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి బాధ్యతలు అప్పగించారు. 2020 మేలో ఒక్కో భవనానికి రూ .17.50 లక్షల చొప్పున జిల్లాలో 309 భవనాలకు రూ.54.60 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాతో నిధులు మంజూరు చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. 10 భూ వివాదాలు, కోర్టు, కాంట్రాక్టు ముందుకు రాక పోవడం వంటి వివిధ కారణాలతో పనులు ఇప్పటి వరకు మెదలు పెట్టలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 52 హెల్త్ సెంటర్లు మంజూరు కాగా మట్టి తీసినవి 1, పునాదులు 16, గోడలు 8, స్లాబ్ 1, పూతల 5 పూర్తయినవి 21. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 66 హెల్త్ సెంటర్లు మంజూరు కాగా మొదలు పెట్టినవి 4, మట్టి తీసినవి 3, పునాదుల 12 ,గోడలు 7, స్లాబ్ 9, పూతల 10, పూర్తయి నవి 17. మదనపల్లి నియోజకవర్గంలో 35 హెల్త్ సెంటర్ల మంజూరు కాగా ఇప్పటి వరకు మొదలు పెట్టినవి 1, మట్టి తీసినవి 0, పునాదుల 12, గోడలు 9, పూతలు 7, పూర్తయినవి 4. పీలేరు నియోజకవర్గంలో 56 హెల్త్ సెంటర్ మంజూరు కాగా మొదలు పెట్టినవి 0, మట్టి తీసినవి 0, పునాదులు 3, గోడలు 8, స్లాబుల 3, పూతల 15, పూర్తయినది 27. రాజంపేట నియోజకవర్గంలో 38 హెల్త్ సెంటర్ల మంజూరు కాగా ఇప్పటివరకు మొదలుపెట్టని 4, మట్టి తీసినవి 1, పునాదులు 8, గోడలు 0 ,స్లాబ్లు 4, పూతల 1, పూర్తయినవి 19. రాయచోటి నియోజకవర్గం 62 హెల్త్ సెంటర్ మంజూరు కాగా ఇప్పటి వరకు మొదలు పెట్టనవి 1, మట్టి తీసినవి 3, గోడలు 6 , స్లాబులు 5 , పూతలు 7, ఇప్పటివరకు పూర్తయినవి 30. మిగిలిన వివిధ దశలలో నిలిచిపోయాయి. ఇప్పటి వరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన సెంటర్లు పూర్తి కావాలంటే ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని పలువురు విమర్శిస్తున్నారు. చేసిన పనులకు సకాలంలో బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులను వదిలేస్తున్నారు. హెల్త్ సెంటర్లు వసతి సమస్య కారణంగా పూర్తి సేవలు ప్రజలకు అందించాలని వైద్య సిబ్బంది అంటున్నారు. ప్రజలకు సూచనలు సలహాలు, వైద్యం అందించాల్సిన సరైన ఏర్పాటు లేకపోగా ఇరుకు గదులలో ఇబ్బందిగా ఉందని వైద్య అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ నాటికి హెల్త్ సెంటర్లను వంద శాతం పూర్తి చేయాలని సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుంది. జిల్లాలో సకాలంలో హెల్త్ సెంటర్లు కేంద్రాలు పూర్తిస్థాయిలో అవుతాయో లేదో వేచి చూడాలిసందే .

వేగవంతం చేస్తాం

జిల్లాలో హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం. మండల ఇంజినీర్లతో సమీక్షించి సమా వేశాలు నిర్వ హిస్తున్నాం. ప్రస్తుతం బిల్లుల కూడా సకాలంలో అందతున్నాయి. సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి స్థాయిలో హెల్త్ సెంటర్లును పూర్తి చేయాలినే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- కె.జె.ఎస్.చంద్రారెడ్డి, పిఆర్ ఎస్ఇ, రాయచోటి.

శ్రామిక జనగర్జనలో భాగస్వామ్యం కావాలి

మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

'క్విట్ ఇండియా' స్ఫూర్తితో మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో విజయవాడలో ఈనెల 9న నిర్వహించబోయే శ్రామిక జనగర్జనలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజనేయులు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ విశ్వనాథ్ కోరారు. గురువారం పట్టణంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కార్మిక వర్గ సమస్యలు తొమ్మిదేళ్ల మోడీ పాలనలో పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కనీస వేతనం 26వేలు పెంచాలన్నా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని వాపోయారు. స్కీం వర్కర్ల శ్రమను దోచుకోవటం తప్ప వారిని పర్మినెంట్ చేయడం లేదని పేర్కొన్నారు. కీలక రంగాలతో సహా ప్రతి ప్రభుత్వ రంగ సంస్థను ప్రయివేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, 900 రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగ్గడం లేదని పేర్కొన్నారు. అ సంఘటిత రంగ కార్మికులందరికీ పిఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలు తదితరాలతో కూడిన సామాజిక భద్రతను ఇంత వరకు ప్రకటించలేదని తెలిపారు. కాంట్రాక్ట్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2015 నుంచి త్రైపాక్షిక భారత కార్మిక మహాసభను నిర్వహించలేదని, ఈ మహాసభలు జరిగితే కార్మిక సమస్యలు చర్చలకు వస్తాయని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల ధరలు ఆకాశానికి అంటి, వేతనాలు పాతాళానికి పోతున్నాయని పేదరికం, ఆకలి, నిరుద్యోగం పెరుగుతోందని, సంపద మొత్తం కొద్ది మంది చేతుల్లో పోగుపడి ఆర్థిక సంక్షోభాలకు దారి తీస్తోందన్నారు. ఈ ప్రభుత్వం కొనసాగితే కార్మికులకే కాక రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు తదితర శ్రామికులందరికీ తీవ్రమైన నష్టం వస్తుందని అన్నారు. కార్మికుల మద్దతుతో చేసిన రైతుల పోరాటానికి తలొగ్గి నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసినప్పటికీ, రైతులకు మోడీ చేసిన వాగ్దానాలు ఇంత వరకు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎంపీలు పార్లమెంట్‌లో రైతు వ్యతిరేక చట్టాలను, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను బలపర్చారని మైనార్టీలపై, సామాజిక తరగతులపై సంఘపరివారం చేస్తున్న దాడులపై వైసిపి, టిడిపి, జనసేనలు నోరు విప్పటంలేదని చెప్పారు. ఈ నెల 9న విజయవాడలో నిర్వహించే శ్రామిక జన గర్జనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అల్లబకష్, రెడ్డయ్య, ఎపో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుతు నేలపాటి శ్రీనివాసులు, ఎఐటియుసి రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, రమణ పాల్గొన్నారు.

మహిళకు సాయమందిస్తున్న షరీఫ్

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మండలంలోని పేద వధువు పెళ్లికి జిన్న సేవ సంస్థ షరీఫ్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబంలో తల్లి బీడీ పని చేసుకొని జీవనం సాగిస్తోందని కుమార్తె వివాహం నిశ్చయించడంతో జిన్నా సేవా సంస్థ దృష్టికి తీసుకురాగా వారు ఆ కుటుంబానికి కావాల్సిన బియ్యం సరుకులు అందించారు. చిన్న షరీఫ్ చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకొని నవాజ్ క్రిష్ రూ.5 వేలు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

నలుగురు అధ్యాపకుల నియామకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం డిగ్రీ కళాశాల లెక్చరర్ల బదిలీలో భాగంగా పట్టణంలోని బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నలుగురు అధ్యాపకులను నియమించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఇందులో డాక్టర్ జి.శ్రీదేవి (ఇంగ్లీష్), డాక్టర్ జి.చిన్నరెడ్డి (కెమిస్ట్రీ), డాక్టర్ జి.శ్రీనివాసులు (తెలుగు), డాక్టర్ సి.ఎస్.శైలజ (బాటనీ) వీరందరూ సూపరింటెండెంట్ వి.ఎం.శ్రీధర్ ఉత్తర్వులు అందుకున్న అనంతరం కళాశాలలో గురువారం విధులలో చేరడం జరిగిందని తెలిపారు. ఇక మీదట విద్యార్థులకు తరగతులను యధావిధిగా జరుగుతాయని,విశిష్టత కలిగిన బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలను ఎంపిక చేసుకుని తదుపరి రెండవ విడత ప్రవేశలలో అడ్మిషన్ తీసుకోవాలని, గతంలో ఉన్నత విద్యను అభ్యాసించిన విద్యార్థులకు, తల్లితండ్రులకు, పట్టణ పుర ప్రముఖులకు, పాత్రికేయులకు ఈ విషయాన్ని తెలియజేస్తూ విద్యార్థుల ప్రవేశాలకు సహకరించాలని, ప్రభుత్వం అందించిన ఈ గొప్ప అవకాశాన్ని ముందుకు తీసుకుపోవడానికి, కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని తెలిపారు. కొత్తగా చేరిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

1098 ఆకారంలో కూర్చొని సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మానవ అక్రమ రవాణాపై గురువారం స్థానిక పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆల్ పీపుల్ స్టూడెంట్ యూనిట్ ఫోర్స్ ఎన్‌జిఒ ఫౌండర్ ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో అక్రమ రవాణా, బానిసత్వంపై వివరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది అమాయకులు, బాలికలు, బాలలకు మాయ మాటలు చెప్పి వారిని అక్రమ రవాణాతో పాటు అక్రమ నిర్బంధం చేసి బానిసత్వంగా పనిచేయిస్తున్నారన్నారు. యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి తరహా సంఘటనలు జరిగితే 1098కి తక్షణమే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు 1098 ఆకారంలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, అధ్యాపకులు నరసింహులు, ప్రసాద్, రవి, వెంకట్రమణ, రమణ, శేఖర్, సంస్థ సభ్యులు మహేష్, జగదీష్, చాను, నఫీస్, చరణ్, అష్రఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి అన్నారు. గురువారం యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తూ యోగాపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. రాయచోటి ప్రజలు కూడా యోగా చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని, నెల రోజుల పాటు యోగా శిక్షణ ఇస్తామన్నారు. రోజూ యోగా చేయడం వల్ల ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏ వయసు వారైనా యోగా చేయవచ్చని తెలిపారు. ఆరోగ్యానికి సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా జూన్ 3 వరకు నిర్వహించే యోగా తరగతులలో యోగా మాస్టర్ ద్వారా తెలుసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో లయన్ తులసిశ్వర్ రెడ్డి, యోగ మాస్టర్ మణి రెడ్డి కాంత్, లయన్ వి నారాయణరెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని గుర్తిస్తే నివారణ సులభం

వాల్మీకిపురం: సకాలంలో క్షయవ్యాధిని గుర్తించి మందులు వాడితే నివారణ సులభమని జిల్లా అదనపు వైద్యాధికారిణి శైలజ అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్షయవ్యాధి, కుష్టు వ్యాధి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం, ఆకలి లేకపోవడం, తరచూ అనారోగ్యం కారణంగా బరువు తగ్గడం, గళ్ళతో పాటు రక్తం పడడం వంటి లక్షణాలను వెంటనే గుర్తించి దగ్గరలోని ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్ రమేష్ బాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగేంద్ర, సిబ్బంది శంకర, మురళి, నాగిరెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారిణి శైలజ

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి- కలకడ

బాలింతలు, గర్భిణులు సకాలంలో వైద్య పరీక్ష నిర్వహించు కోవాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముడిమారిపల్లిలో ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సకాలంలో వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. గర్భిణులు రక్తహీనత కలిగిన వారు ఐరన్, సుక్రోజ్, 6వ నెల నుంచి తీసుకో వాలని, అలాంటివారు ఉన్నత స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. 60 సంవత్సరములు పైబడిన వారికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారాలు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అంగన్వాడీగా కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, వ్యాక్సినేషన్, రిజిస్టర్లు, గ్రోత్ చార్ట్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, ఆరోగ్య కార్యకర్తలు భాగ్యమ్మ , ఆర్.శివకుమార్‌బాబు, డేటా ఎంట్రీ రోజా, పైలెట్ రమేష్‌బాబు, ఆశా కార్యకర్త గౌస్య పాల్గొన్నారు.

వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

పుల్లంపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సుధాకర్‌రాజుపై ఎట్టకేలకు వేటు పడింది. ఎస్‌పి గంగాధర్‌రావు గురువారం పుల్లంపేట హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రాజును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకెళితే మద్యం మత్తులో ఉన్న హెడ్‌కాని స్టేబుల్ శ్రీరాములపేట వాసులను విచక్షణారహితంగా దాడిచేసిన ఘటనలో ఎస్‌పి చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ ఎఇగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎఇ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మండల విద్యుత్‌శాఖ ఎఇగా గురువారం చంద్రశేఖర్ పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన రాజంపేట ఎఇగా ఉంటూ పుల్లంపేట ఇన్‌ఛార్జి ఎఇగా పని చేశారు. గురువారం నుంచి పూర్తిస్థాయి బాధ్య తలను చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల సకాలంలో వ్యవసాయ రైతులకు అందించడానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకూడదని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌ఇంజినీర్, కాంట్రాక్టర్ మల్లికార్జున, విద్యుత్ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

వీధిదీపాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని జాగువారిపల్లి ఉపసర్పంచ్ నాగిరెడ్డి రాజమౌలాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జాగువారిపల్లి గ్రామపంచాయతీ లోని వీధిలైట్లు మరమ్మత్తులు చేపట్టారు. మరమ్మత్తులతో పాటు ప్రతి వీధిలో కొత్త లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మ త్తులతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీధిలైట్లు లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందని అన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్నివిధాలా కృషి చేస్తానని చెప్పారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మదనపల్లె పర్యటనను విజయవంతం చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పిలుపునిచ్చారు. గురువారం నీరుగట్టువారిపల్లెలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీ- నీవా ప్రాజెక్టుకి సంబంధించిన ఒక్క పని కూడా పూర్తి చేయకపోవడం అధికార వైసిపి ప్రభుత్వ చేతగాని తనానికి అద్దం పడుతోందన్నారు. మదనపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నా రాయలసీమ ఎమ్మెల్యేలుగాని, ఎంపీలుగాని మంత్రులుగాని పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొదం సిద్దప్ప, మాజీ కౌన్సిలర్లు నాగరాజు, బండి ఆనంద్‌యులు, మైనారిటీ సెల్ నాయకులు ఖాదర్‌బాష, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు అరుణ్‌తేజ, బాబ్‌జాన్, ప్రణయ్, మెహబూబ్‌ఖాన్, బిసి నాయకులు శ్రీరాములు, శివ, పాల్గొన్నారు.

రామసముద్రం : మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గుంతల పేట గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ను పరిశీలించనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రామినేని జయరాం నాయుడు, శ్రీరామ్‌చినబాబు, బాబురెడ్డి, బోడిపాటి శ్రీనివాసులు అందరూ కలసి పార్టీ కోసం పార్టీ విలువలు కోసం భారీ స్థాయిలో మాజీ ముఖ్యమంత్రికి ఆహ్వానం పలకనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రదీప్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి శివశంకర్, కృష్ణం రాజు యాదవ్, రాజేష్ స్వామి, కృష్ణ మూర్తి, శ్రీనివాసులు,బాబాజాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కురబలకోట :** సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం పై యుద్దభేరి పేరుతో చేపట్టిన కార్యక్రమానికి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉదయం 9గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించనున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల జనరల్ సెక్రటరీ ఓ.రెడ్డిశేఖర్ కోరారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకరయాదవ్ ఆధ్వర్యంలో ములకల చెరువులో చంద్రబాబు కు స్వాగతం పలకనున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మదనపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాం చినబాబు

అభివృద్ధిపై దృష్టి సారించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో సమస్యలు లేకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, ఉపాధి, పశుసంవర్ధకశాఖ తదితర శాఖలపై ఆయన మాట్లాడారు. గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సచివాలయం ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు సహకరించాలన్నారు. మండల సర్వసభ సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంవి డిఒను సూచించా చారు. భూమిలేని నిరుపేదలను గుర్తించి వారికి అసైన్డ్ భూములను మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 50 శాతం ఉపాధి నిధులతో భూముల వద్దకు ఫార్మేషన్ రోడ్డు చేసు కోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హైదర్‌వల్లి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ అరవింద్ కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ. సర్పంచ్ సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి,వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

రోగులతో మాట్లాడుతున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ వై.విజయ భాస్కర్, కమిటీసభ్యులు మహమ్మద్‌రఫీక్ పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్, కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం వైద్యులతో కలిసి ఆస్పత్రికి సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, లక్కిరెడ్డిపల్లెలో నూతన ఆస్పత్రి భవనాన్ని రూ.5.75 కోట్లతో నిర్మింప చేశారని అన్నారు. వైద్యులు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవల ను అందించాలని గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తగు సూచనలు చేయాలని కోరారు.అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అన్ని వసతులు ఉన్నాయని గర్భిణులపై పత్యేక శ్రద్ధ వహించి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. మందులకు కూడా ఎటువంటి కొరత లేకుండా చూస్తున్నామని, బిపి, షుగర్ వ్యాధి ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, మందులు ఇస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో వైసిపి పఠాన్ సాదుల్లాఖాన్, డాక్టర్లు నవాజ్, భరత్‌కుమార్, క్లర్క్ రెడ్డికృష్ణ, హెడ్‌నర్స్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది మదన్, సునీల్ రాజు, పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సకాలంలో అందించాలని ఎంపిడిఒ శేషగిరిరావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ సూపర్వైజర్ భానులక్ష్మీదేవి నిర్వహించిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారం కిట్ల పంపిణీ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ.రమణారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించటానికి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, సిహెచ్ఒ మల్లిక, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని మూడు అంగన్వాడీ కేంద్రాలలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ చేతుల మీదుగా పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్‌హోమ్ రేషన్ కార్యక్రమం రేషన్‌ను ఉచితంగా బాలింతలు, గర్భిణులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ కాంతమ్మ, అంగన్వాడీ టీచర్లు మమత, విజయ, భారతి, నాయకులు ఆకెపాటి రమేశ్ రెడ్డి, తుమ్మధి శివకుమార్, నాగేంద్ర, వెంకటేశ్, అక్కివెంకట రమణ, శివ నరసింహులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మహిళలకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న వైసిపి నాయకులు

తప్పుల్లేని ఓటర్ల జాబితాకు సహకరించండి

- ఎన్నికల నమోదు అధికారి గోపాలకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల నమోదు అధికారి గోపాలక్రిష్ణ

ప్రజాశక్తి-పీలేరు

వచ్చే 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సౌకర్యంగా తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీ కోసం అందరూ సహకరించాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ గోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ధనుంజయులు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఆరు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇఆర్ఒ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా విచారణ కార్యక్రమం పారదర్శకంగా జరిగేలా చూడాలని అన్నారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, ఓటర్ల బదిలీలు, జాబితాలో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల నమోదు లేదా, తొలగింపు కోరుతూ అధిక మొత్తంలో ఎవరు దరఖాస్తులు తీసుకువచ్చినా వాటిపై ఆచి, తూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా అందుబాటులోకి వస్తుందని, ఓటర్లు తమ పేర్లు ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలని చెప్పారు. 1500 మంది ఓటర్లకు ఒక్క పోలింగ్ స్టేషన్ వంతున కేటాయిస్తూ ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలున్నాయని తెలిపారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని పీలేరు, కెవి పల్లి, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాల తహశీల్దార్‌లు, ఎన్నికల విభాగం డిటిలు పాల్గొన్నారు.

ఓటరు సర్వేని పకడ్బందీగా నిర్వహించండి : టిడిపి

వీరబల్లి : మండలంలో ఓటర్ వెరిఫికేషన్‌లో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి వెంకటరమణ నాయుడు తహ శీల్దార్ మహేశ్వర్‌రెడ్డికు వినతిపత్రం ఇచ్చారు. గురువారం మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ బిఎల్ఒలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి వెంకటరమణనాయుడు ఓటర్ల సవరణపై తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండలంలో మరణించిన వారి ఓట్లను తొలగించాలని, ఒకే పేరుపై రెండు ఓటు కార్డులను గుర్తించి తొలగించాలన్నారు. తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని కోరారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మట్లి మాజీ సర్పంచ్ కొల్లి రవినాయుడు, పార్లమెంట్ బిసి సెల్ కార్యదర్శి కామిని సురేష్, అసెంబ్లీ వాణిజ్య విభాగం కార్య దర్శి చెన్నూర్ పవన్‌కుమార్, రాయ వెంకటేశ్వర్లు నాయుడు, రాయ వెంకట రమణనాయుడు, వీర మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పరసతోపు పంచాయతీలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొ న్నారు. దెబ్బల గుట్టపల్లె , నాయనమ్మగారిపల్లె , చెన్నప్ప గారిపల్లె, ఏటిగడ్డ పల్లెల్లో ఇంటిం టికి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ పార్వతమ్మ ,శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలనపై ప్రజలను ఆరా తీశారు. స్వాతం త్రం వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ఇలాంటి పాలన సాగించిన ముఖ్య మంత్రిలు లేరని ప్రజలు తెలిపారు. ప్రతి కుటుంబానికి రాజకీ యాలకు కులమ తాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ప్రజలు వర్షం వ్యక్తం చేశారు. చెన్నప్పగారిపల్లెలో విద్యుత్ స్తం భాలు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి చర్యలు తీసు కోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. సిసిరోడ్లు త్వరలో ఏర్పాటు చేస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్య కొండ చైర్మన్ మల్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డిమాల్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ సురేంద్రనాథ్, నాయకులు శివారెడ్డి ,రామ్మూర్తి, కరీం పాల్గొన్నారు.

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

నిమ్మనపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. వెంగమ్ వారిపల్లె లోని గొల్లపల్లి, బాలినా యనపల్లె గ్రామాలలో సర్పంచ్ శ్రీదేవి, వైసిపి నాయకులు నవీన్, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ ఆధ్వ ర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైసీపీ ఇన్చార్జ్ ఆర్.ఐ రమణారెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి , ప్రభు త్వం అందించిన సంక్షేమ పథకాలను ,పొందిన సాయాన్ని లబ్ధిదారులకు వివరించారు. బుక్ లెట్ ను వారికి అందించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేషగిరిరావు, తహశీల్దార్ సిఆర్.మంజుల, సర్పంచులు సుబ్రమణ్యం, చెంద్రాయుడు, మహదేవరెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి , శ్రీనివాసులుశెట్టి శివశంకర్‌రెడ్డి, ఎర్ర మల్లయ్య, కదిరప్ప, దూకుడు వెంకటరమణ, మహేష్ , అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు 'తానా' చేయూత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) చేయూతనందించింది.తానా కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ లోకేష్ కొణిదెల జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన మిత్రమండలి సభ్యులు గౌతమ్ కొణిదెల, నిరంజన్ నాని, మహేష్ రాటకొండ, రాజేష్ రాటకొండ,సురేంద్ర,రెడ్డిశేఖర్ తదితరులు ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు రూ.10 వేల చెక్కులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి లోకేష్ ఎంతో దోహదపడుతున్నారని కొనియాడారు. ఆయన పుట్టినరోజున సందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.భవిష్యత్తులో తానా సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు..

ప్రతిభగల విద్యార్థులకు చెక్కులను అందించిన తానా ప్రతినిధులు

క్రీడాకారులతో మాట్లాడుతున్న కడప క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్లు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కడప క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉమెన్స్ సెలెక్టర్ ఖాజా మొహిద్దీన్, మెన్స్ సెలెక్టర్ సురేష్ కుమార్, ట్రైనర్ ఆనంద్, కడప క్రికెట్ అసోసియేషన్ మెంబర్ అశ్విన్‌లు తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ క్రీడా మైదానంలోని క్రికెట్ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12, 14, 16 సంవత్స రాల లోపు బాల, బాలికలు చురుగ్గా ఉన్నారని బాగా శ్రమించి రాష్ట్రస్థాయికి ఎంపికై ఉన్నత శిఖరాలను అందుకోవాలని తెలిపారు. హెడ్‌కోచ్ గయాజ్, అసి స్టెంట్ కోచ్ ఫైరోజ్ ఖాన్‌లోడి, ట్రైనర్ శివకోటిలు క్రీడాకారులకు మంచి శిక్షణ ఇస్తున్నా రని అభినందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గ్రీష్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు నవాజ్‌షరీఫ్, ద్వారకనాథ్‌రెడ్డి

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కలిచెర్ల రెవిన్యూ గ్రామ పరిధిలో మౌలాక ఫహాద్ నందు ఆస్థాన-ఏ-మ గుద్దములహి, అమీన్‌పీర్ దర్గా పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాక ఫహాద్ వెల్ఫేర్ సొసైటీ హాజరత్ ఖాజా సయ్యద్‌షా, అరిపుల్లా మహమ్మద్ మహమ్మద్ హుసేసి చిష్టిపుల్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, శాసన మండలి డిప్యూటీ స్పీకర్ జిక్రియాఖానం, కడప ఆమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి అరిపుల్లా మహమ్మద్ హుసేని ప్రాంభించారు. ఈ శిబిరంలో బెంగళూరు, హైదరాబాద్, రాయచోటి,. కోయంబత్తూరు, కడప, బత్తలపల్లి నుంచి వివిధ రకాల వైద్య నిపుణులు వచ్చి 2100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఆర్‌డిఒ మురళీ వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ బోర్డ్ మెంబర్ అబ్దుల్ కాలీమ్, జిల్లా వర్ఫ్ బోర్డు చెర్మాన్ ఖరిముల్లా, వర్ఫ్ బోర్డ్ వై చెర్మాన్ రషీద్ బేగం, ఇరిగేషన్ బోర్డ్ మెంబర్ రవీంద్ర రెడ్డి, డాక్టర్ అశోషిన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ రెడ్డి, ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్, మండల సచివాలయ కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, కో-ఆప్షన్ ఖాదర్‌వల్లి, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథ్, పద్మావతి తిరుపాల్, విశ్వనా థ్‌రెడ్డి, సరస్వతి, విజయకుమారి, ఎంపిటిసి జయరామ్, శ్రీనివాస్‌నాయక్, మాజీ సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి, వైసిపి నాయకులు కేశవ, ఎర్రగుట్టపల్లి పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణ పనుల సందర్శనలో ఎస్ఇ కృష్ణారెడ్డి

జగనన్న కాలనీ సందర్శన

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ పరిశ్రమల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలను ఎపిఎస్ పిడిసిఎల్ ఎస్ఇ కృష్ణారెడ్డి సందర్శించారు. గురువారం స్థానిక పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో 2, 3వ విడత జగనన్న కాలనీలను, పట్టణంలోని వారపు సంత, తన ప్రాంతాల్లో ఎస్ఇ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవసరం మేరకు 50 విద్యుత్ స్తంభాలను ఎస్ఇ కేటాయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హబీబ్‌బాషా పీలేరు రూరల్ పరిధిలోని విద్యుత్ సర్వీసులను పట్టణ ప్రజల పరిధిలోకి మార్పు చేయాలని ఎస్ఇని కోరారు. ఎస్ఇ కృష్ణారెడ్డి, ఇఇ మునిచంద్ర బోడుమ ల్లువారి పల్లి పంచాయతీలోని వడ్డీపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో ఉన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపిపి ఎస్‌వి.చలపతి, మల్లికార్జున్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పంచాయతీ ఇఒ రెడ్డి ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో హుందాతనం అలవర్చుకోవాలి :'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాజకీయాల్లో హుందాతనం క్రమశిక్షణ ముఖ్యమని ఏపీ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం స్టేట్ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు హుందాతనం, సంస్కారం, నీతి నిజాయితీ లేవని అన్నారు. పులివెందులలో జరిగిన సభలో చంద్రబాబు నాయుడు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సంస్కారం అనిపించుకోదని హితవు పలికారు. ఆయన హయాంలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారో ప్రజలకు తెలపాలని సూచించారు. నాలుగేళ్ల వైఎస్ జగన్ పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రాజెక్టులను పూర్తి చేస్తుంటే అడ్డగోలుగా మాట్లాడడం మంచిది కాదన్నారు. 27 టిఎంసిల సామర్థ్యంతో గండికోట ప్రాజెక్టుని నిర్మించింది జగన్‌మోహన్‌రెడ్డి కాదా అని ఆయన ప్రశ్నించారు.వచ్చే ఎన్నికల్లో పులివెందులలో జగన్మోహన్‌రెడ్డి 80 వేల మెజార్టీతో గెలుపొందుతారని అన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధిపై చంద్రబాబుగాని నీ కుమారుడు లోకేష్ బాబు గాని చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. ప్రజలకు సువర్ణ పాలన అందించే దిశగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని తెలిపారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 135 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ గుర్రెడ్డిగారిపల్లెకు చెందిన రంగనాథ్ (26), స్థానికంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. నిందితుని వద్ద నుంచి 132 కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.